# ఇల

ముకుందంతో నా పరిచయం ఇప్పటిది కాదు. స్కూల్లో ఇద్దరం కలిసి చదువుకున్నాం. వాడి చదువు పదో తరగతితో ఆగిపోయింది. పూర్తిచేయలేకపోయాడు. నేను ఇంటరు వరకు చదువుకున్నాను. ఆ పయిన చదువు కోడానికి వీలుకాలేదు. ఆర్థిక ఇబ్బందులే కారణం. నాన్నను ఇబ్బంది పెట్టాలని అనిపించలేదు. ప్రభుత్వరంగ సంస్థలో ఒక జాబ్ కాంట్రాక్టరు దగ్గర ఉద్యోగంలో చేరాను. అదీ తేలికగా ఏం దొరకలేదు. కష్టపడాల్సి వచ్చింది. ముందు నన్ను గుమాస్తాగా ఉపయోగించు కుంటానన్నవాడు అటెండరుగా స్థిరపరిచాడు. జాబ్ కాంట్రాక్టర్లు మారుతూ ఉంటారు. కాంట్రాక్టులు బిడ్డింగ్‌ల మీద జరుగుతూ ఉంటాయి. ఈ సంవత్సరం ఉన్న కాంట్రాక్టరు మరుసటి సంవత్సరానికి ఉండొచ్చు. మారొచ్చు. మా ఉద్యోగాలు మటుకు, కార్మిక చట్ట ప్రకారం కాంట్రాక్టరు మారినా, నిలకడగానే ఉంటాయి. తీసేయరు. అయితే, ఇంక్రిమెంట్లు ఉండవు. ప్రమోషన్లు ఉండవు. సంవత్సరానికి ఒకసారో, రెండుసార్లో కరువుబత్తెం పెరుగుతుంటుంది.

నా ఉద్యోగంలో సెలవు ఇవ్వరు. ఏదయినా ప్రమాదం జరిగితే, అదీ పని సమయంలో, పూర్తి జీతంతో సెలవిస్తారు. సంవత్సరంలో రెండు వారాలపాటు బ్రేక్ ఉంటుంది. పర్మనెంట్ అవడం అంటూ ఏమీ ఉండదు. ఇ.ఎస్.ఐ., ప్రావిడెంట్ ఫండ్, కోతల పోను జీతం నెలకు అయిదువేల అయిదు వందలు వస్తాయి. ఒంటరిగాడిని. చిన్న గది అద్దెకు తీసుకుని ఉంటున్నాను. మధ్యాహ్నం ఆఫీసు కేంటీన్‌లో భోజనం చేస్తుంటాను. సాయంత్రాలు వంట చేసుకుంటాను. ఇబ్బంది అనుకోకుండా నెలకు కనీసం వెయ్యి రూపాయలయినా నాన్నకు పంపిస్తూ ఉంటాను. నాన్నా, అమ్మ వాళ్లు నన్ను చూడటానికి ఎప్పుడూ రాలేదు. ఇక్కడికి మా ఊరు చాలా దూరంలో ఉంది. రాలేరు. నేనిక్కడ ఏదో పెద్ద ఉద్యోగం చేస్తున్నానని అనుకుంటూ ఉంటారు. మా ఊరు వెళ్ళిన ప్రతి సారి నేను చేస్తూ ఉన్న ఉద్యోగం గురించి చెప్పాలని అనిపిస్తూ ఉంటుంది. చెప్పలేకపోతాను.

బి.పి.కరుణాకర్

ముకుందం నాతోపాటు ఇక్కడకు వచ్చిన కొత్తలో అక్కడక్కడా చిన్న చిన్న పనులు చేశాడు. మా కాంట్రాక్టర్ల దగ్గర ఉద్యోగం ఇప్పించడానికి నేనూ ప్రయత్నాలు చేశాను. ఫలించలేదు. కొన్నాళ్ళపాటు రేడియో, టి.వి.లు బాగుచేసే దుకాణాల్లో పనిచేసి ఏం నేర్చుకోకుండా మిగిలిపోయాడు. వాడిని తీసుకున్నవాళ్ళు రిపేరు పనుల మాట పక్కనపెట్టి, గదులు ఊడ్చడం, టీలు, టిఫిన్లు తెప్పించుకోవడం, వాళ్ళు తాగిన గ్లాసులు, తిన్న గిన్నెలు కడిగిస్తూ ఉండేసరికి, విసుగు పుట్టి మానేసి పాతపేపర్లు కొని, అమ్మే దుకాణం పెట్టాడు. వాడి అయిదువందల పెట్టుబడికి నేను మూడు శాతం వడ్డీకి అయిదువేలు తీసుకొచ్చి ఇచ్చాను. వాడి కాళ్లాని నిలబడడానికి నెలా పదిహేను రోజులేమో పట్టింది.

అంత చిన్న వ్యాపారంలో అంత డబ్బు కదులుతుందని నాకు తెలియదు. ఊహించను కూడా లేదు. తర్వాత వాడు పట్టిందంతా బంగారమే అయింది.

రెండోనెల చివర్లో నేనిచ్చిన డబ్బు వడ్డీతో తిరిగి ఇచ్చేశాడు. నెల గడిచాక పక్క దుకాణం అద్దెకు తీసుకున్నాడు. ఉదయం నుండి సాయంత్రం వరకు కొన్న పాత దిన, వార, మాసపత్రికలు, పుస్తకాలు, చిన్నా చితక వస్తువులు ఒహటేమిటి ఎన్నో, సాయంత్రం ఆరు దాటగానే మొదట్లో ఆటోలో వేసి మరొకరికి అమ్మేసేవాడు. తర్వాత డి.సి.యం వేనులో వెళ్ళేవి. ఇప్పుడు రెండు లారీల నిండుగా పంపిస్తున్నాడు. ఇద్దరు పనివాళ్ళను పెట్టుకున్నాడు.

సాయంత్రం నాలుగున్నరకు నాపనయి పోతుంటుంది. గదికి చేరుకునేసరికి అయిదవుతుంది. వంటపని పూర్తి చేసుకుని ఆరున్నర అవుతుండగా ముకుందం దగ్గరకు వెళ్ళి కూర్చుంటాను. అప్పటికి వాడు ఫ్రీ అయిపోతాడు. ఇద్దరం కబుర్లలో పడిపోయినప్పుడు సమయం తెలిసేది కాదు. వాడికీ పెళ్ళి కాలేదు. నాకులా వంటరాదు. ఏమెస్ నుండో మీల్స్ పార్సెల్ తెప్పించుకుంటాడు. రెండుపూటలకు వస్తుంది. మూడు నాలుగు రోజులకొకసారయినా రెండో ఆట సినిమాలకు వెళ్తాంటాం.

నాకు పుస్తకాలంటే ఇష్టం. వాడు నా కోసం ఒక మంచి పని చేస్తుండేవాడు,. తనకు వచ్చిన వార, మాసపత్రికలను తీసి నా కోసం పక్కన పెట్టేవాడు. నాకు కాలక్షేపంగా ఉండేది. ప్రత్యేక సంచికలు తప్ప మిగతావి చదివి తిరిగి ఇచ్చేస్తుండే వాడిని.

ఒకసారి వాడిచ్చిన పాత మాసపత్రిక ప్రత్యేక సంచిక  చదువుతోంటే బాగా పాతబడి మడతలు పెట్టిఉన్న కాయితం కనిపించింది. పాత కాయితం కదా అనుకుని మడిచి గది మూలకున్న చెత్తబుట్టలో, చుట్టచుట్టి, పడేలా విసిరేద్దామనిపించింది. కాయితం చేతిలోకి తీసుకున్నాను. ఎంచాతనో విసిరేయ బుద్ధి కాలేదు. ఉత్తరంలా అనిపించింది. నాలుగు మడతలు పెట్టి ఉంది. మడతలున్న చోట అక్కడక్కడా చిరిగిపోయి ఉంది. కాయితం తెల్లగా లేదు. పొగచూరిన గోడలాఉంది. ఎన్నోసార్లు చదివి భద్రంగా దాచిపెట్టుకున్నట్టుగా అనిపించింది. జాగ్రత్తగా మడతలు విప్పాను.

అది పెద్ద ఉత్తరమేమీ కాదు. ఒకరి ఉత్తరం చదవడం మంచిపని కాదని తెలుసు. చదవాలన్న ఆసక్తిని చంపుకోలేకపోయాను. ఆ పత్రిక మీద ఎవరి పేరయినా కాని టెలిఫోను  నంబరు కాని చిరునామా కాని ఉంటుందేమోనని చూశాను. అమ్మిన ఏజంటు రబ్బరు ముద్ర తప్ప మరేమీ లేదు. అదీ స్పష్టంగా లేదు.

అందులో ఇలా ఉంది :

“చిరంజీవి లలితకు,

“నా పేరు రాజారావు. మీ నాన్నగారి స్నేహితుడిని. నా గురించి నీకు మీనాన్నగారు చెప్పారో లేదో నాకు తెలియదు. మీ అన్నయ్యకు నేను బాగా తెలుసు. మీ అన్నయ్యకు కూడా ఉత్తరం రాస్తున్నాను.  ప్రతి సాయంత్రం మీనాన్నగారూ, నేనూ మరికొంతమంది మిత్రులం అలా యూనివర్శిటీలోకి నడుచుకుంటూ వెళ్ళి, చీకటి పడేవరకు పార్కులో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వుండేవాళ్ళం. మీనాన్నగారికి నేను దగ్గరగా ఉండేవాడిని. నీ గురించి, మీ అన్నయ్య గురించి మా అందరితో గొప్పగా చెబుతూ ఉండేవారు.

“పాపా, గమ్మత్తేమిటంటే మీ అమ్మగారు చనిపోయి పదిహేనేళ్ళు అవుతున్నా ఆమె గురించి ప్రస్తావించని రోజు లేదు. సగం ఆమెతోనే చనిపోయినట్టు నాకు అనిపించేది. మిగిలిన సగం ముగిసి ఇది పన్నెండోరోజు. మేము యూనివర్శిటీ నుండి తిరిగి వస్తున్నప్పుడు గుండె నొప్పి తీవ్రంగానే వచ్చింది. తట్టుకోలేకపోయారు. వైద్యసహాయం అందే వరకు ఉండలేకపోయారు. అంతకు రెండు రోజుల ముందే తనకేమయినా జరిగితే మీకు కబురు చేయొద్దని మా అందరితో అన్నారు. అతని కోరిక మన్నించడానికి నీకు గాని మీ అన్నయ్యకుగాని కబురు చేయలేదు. అన్ని ఏర్పాట్లు ముందే చేసుకుని, మీ రాత పూర్వక అనుమతులు ముందే

తీసుకున్నాడనుకుంటాను. కంటి ఆస్పత్రివాళ్ళు వచ్చి కళ్ళు తీసుకువెళ్ళి పోయారు. గాంధీ ఆసుపత్రివాళ్ళు శరీరాన్ని తీసుకెళ్ళారు.

"వీలునామా, ఫిక్సెడ్ డిపాజిట్ పుస్తకాలు, ఇంటికి సంబంధించిన కాయితాలు మీ చిన్నాయనకు నిన్ననే అందజేశాను. ఇవేళో రేపో అతను మీతో మాట్లాడతాడు."

"పోయిన నెల మీ ఊరు నుండి వచ్చాక మనిషి డీలా అయిపోయారు. అంతకు ముందు ఎంతో ఉత్సాహంగా మాతో కబుర్లు చెప్పిన వాడికి పదిహేనేళ్ళు హఠాత్తుగా మీద పడినట్లు కనిపించాడు. 'ఏమయింది?' అని నాలుగయిదుసార్లు నేను గుచ్చి గుచ్చి అడిగితే వారం రోజుల్లో చనిపోతాడనగా ఒక్క నాతోనే అన్నారు. మీ ఇంటినుండి నాకు, మిగతా మిత్రులకు ఫోన్లు చేస్తున్నందుకు నువ్వో, మీ ఆయనో ఎస్.టి.డి. బిల్లు ఎక్కువ అవుతుందని, అరగంటపాటు ఆయన మీద అరిచారని చెప్పి, బాధపడుతూ, 'తప్పు వాళ్లది కాదురా, నాది, అక్కడ నాతో మాట్లాడేవాళ్ళు ఎవరూ లేకపోతే మీతో మాట్లాడాను' అని విచారించారు. నేను ఒంటరిని. ఆత్మీయతలు తెలియవు. మీ నాన్న ఒంటరి కాదమ్మా, కాని.. అయిపోయిందేదో అయిపోయింది. బిల్లు ఎంతయి ఉంటుందో తెలియదు. అయిదు వేలుకు చెక్కు పంపిస్తున్నాను. సరిపోతుందనే అనుకుంటున్నాను. మీ కోసం ఎంతో కష్టపడి, తనే తండ్రి, తల్లి అయి పెంచి పెద్ద చేసి మీ జీవితాలకు దారి చూపించిన మీ నాన్న ఏమీ మిగుల్చుకోలేదమ్మా; చివరకు గుప్పెడు బూడిదయినా...

ఆశీస్సులతో"

కింద సంతకం లేదు. ఊరు పేరు లేదు. ఏ ఊరయినా అయి ఉండొచ్చు. కాలం తినేసినట్టు తేదీ స్పష్టంగా కనిపించడం లేదు. నిన్న, ఇవాళ, రేపు ఏదయినా ఏం తేడా ఉంటుంది?

* ఆదివారం వార్త, 18 జూలై, 2010